క్లుప్తంగా

మహాలక్ష్మమ్మ గుడి పరిశీలన



విజయపురిసౌత్: మాచర్ల మండలం జెమ్మిగడ్డ తండాలో నిర్మాణంలో ఉన్న మహాలక్ష్మమ్మ గుడిని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు గురువారం పరిశీలించారు. అనంతరం దేవస్థానం అధికారులు మహాలక్ష్మమ్మ గుడికి ఆర్థిక సహాయం ప్రకటించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆర్.భీమానాయక్, ఉపాధ్యక్షుడు బాణావత్ వెంకటేష్‌నాయక్, పూజారి రమావత్ రెడ్డినాయక్, వడితే శరత్‌బాబునాయక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు



మిట్టగుడిపాడు(రెంటచింతల): భూసార పరీక్షలతో ఎంతో మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి చెప్పారు. గురువారం సాగుకు సమాయత్తం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ సూక్ష్మ పోషకాల లోపాలు, నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. భూసార పరీక్షల ఉపయోగాలను చెప్పారు. జీవన ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సమావేశంలో వీఏఏలు, వీహెచ్ఏలు గొంటు కృష్ణారెడ్డి, పవన్ కిశోర్, గొట్టం లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

14న ఉచిత ఖత్నా కార్యక్రమం

మాచర్ల: నియోజకవర్గ ముస్లిం యూత్ కమిటీ హాజీబాజీ భాయ్ (చికెన్) ఆధ్వర్యంలో ఈనెల 14న ఉచిత ఖత్నా (సుంతీ) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురువారం నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని జెండా చెట్టు వద్ద ముస్లిం షాదీఖానాలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ముందుగా కమిటీ సభ్యులు మౌజాన్ అబ్దులా జానీ కేసీపీ, అమీర్ క్లినిక్‌లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సుంతీ చేయించుకునే పిల్లలకు జ్వరం, కామెర్లు ఉండకూడదని వివరించారు. కార్యక్రమానికి పిల్లలతో పాటు ఇద్దరు సహాయకులుగా రావచ్చునని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 85008 06468, 99129 64389 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు వేంకటేశ్వస్వామి కల్యాణ మహోత్సవం

గురజాల : గంగవరం గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 6వ వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి కల్యాణం అనంతరం అన్నప్రసాద వితరణ , సాయంత్రం సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామి ఊరేగింపు జరుగుతాయని కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మండల అభివృద్ధికి కృషి చేద్దాం

వెల్దుర్తి: అన్ని రంగాల్లో మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ చింతా శివరామయ్య చెప్పారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా, పారిశుద్ధ్యం, ఉపాధి హామీ పనులు, విద్య, వైద్యంతోపాటు పలు అంశాలపై చర్చించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ రూప్లీ బాలునాయక్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు అలుగుమల్లి సంజీవరెడ్డి, రాయంకుల గోపాల్, ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ జవహర్‌లాల్‌నెహ్రూ, ఏఈలు శ్రీనివాసరెడ్డి, బాబునాయక్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ రోడ్డులో చోరీ

పిడుగురాళ్ల: కొబ్బరి నీళ్లు తాగుతుండగా ద్విచక్ర వాహనానికి తగిలించి ఉన్న నగదు బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గురువారం జరిగింది. బాధితుడు నిమ్మల నరసింహారెడ్డి కథనం ప్రకారం నరసింహారెడ్డి పట్టణంలోని బ్యాంక్‌లో క్రాప్ లోన్ ద్వారా రూ.1.60 లక్షలు డ్రా చేసుకొని న్యూ వెల్లంపల్లి గ్రామానికి బయలుదేరాడు. మార్గ మధ్యలో రైల్వే స్టేషన్ రోడ్డులో కొబ్బరి నీళ్లు తాగేందుకు ద్విచక్ర వాహనం ఆపాడు. వెనుక నుంచి ద్విచక్రవాహనాలపై వచ్చిన వ్యక్తులు నరసింహారెడ్డి వాహనానికి తగిలించి ఉన్న బ్యాగ్‌ను తీసుకెళ్లిపోయారు. దీనిపై నరసింహారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పవర్‌ఫుల్



తంగెడలో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్

- తంగెడలో రూ.3 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం
- ముగింపు దశకు చేరిన పనులు
- నెలరోజుల్లో అందుబాటులోకి..
- కృష్ణా తీరంలో తీరనున్న కరెంట్ కష్టాలు



విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి(ఫైల్)

దాచేపల్లి : కృష్ణానది తీర గ్రామాలు ఇక పవర్‌ఫుల్‌గా మారనున్నాయి. కరెంట్ కష్టాలు తీరనున్నాయి. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో దాచేపల్లి మండలం తంగెడ గ్రామ సమీపంలో రూ.3 కోట్లతో 33కేవీ/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టారు. ఈ పనులు దాదాపుగా ముగింపు దశకు చేరుకున్నాయి.

ఎన్నికల హామీ మేరకే

ఎన్నికలకు ముందు తంగెడ గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అదేబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు కరెంట్ సమస్యను కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఏకంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌నే నిర్మించి శాశ్వతంగా కరెంట్ సమస్యలు పరిష్కరిస్తామని కాసు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన వెంటనే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం రూ.3 కోట్లు మంజూరు చేయించారు. గత ఏడాది చివరలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధప్రాతిపాదికన పనులు చేపట్టారు. సబ్‌స్టేషన్‌లో 5ఎంఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చేశారు. 11కేవీ సామర్థ్యం కలిగిన నాలుగు బ్రేకర్లు అమర్చారు. ఇప్పటికే టెక్నికల్ ట్రైల్ విజయవంతంగా నిర్వహించారు. నెల రోజుల్లో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రయోజనాలివీ..

తంగెడ, ముత్యాలంపాడు గ్రామాలకు వేర్వేరు లైన్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం మాదినపాడు సబ్‌స్టేషన్ నుంచి కరెంట్ సరఫరా చేయడంతో అంతరాయం కలిగితే పరిష్కరించేందుకు చాలా సమయం పడుతుంది. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో ఎక్కడైనా సరఫరాకు అంతరాయం కలిగినా వెంటనే సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు వీలు కలుగుతుంది. తంగెడ, ముత్యాలంపాడు, సారంగపల్లి అగ్రహారం, మాచవరం మండలం వేమవరం, చెన్నాయపాలెం గ్రామాలకు నాణ్యమైన కరెంట్ సరఫరా సాధ్యమవుతుంది. భవిష్యత్‌లో 3 ఫేజ్ కరెంట్‌ను నిరంతరాయం అందించే అవకాశాలున్నాయి. ఈ ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు మొగ్గుచూపే అవకాశం ఉంది. తంగెడ సమీపంలోని కృష్ణానది ఒడ్డున రూ.130 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మించేందుకు ప్రభుత్వం, ఎమ్మెల్యే కాసు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఆ పథకానికీ సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరాకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

మా కష్టాలు తీరుతాయి



విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్నాం. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి అదేబాట కార్యక్రమంలో తీసుకెళ్లాం. కరెంట్ సమస్య తీవ్రతను ఎమ్మెల్యే కాసు గుర్తించి రూ.3 కోట్లు మంజూరు చేయించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. మా గ్రామంలో కరెంట్ కష్టాలు తొలగిపోతాయి. ఆనందంగా ఉంది.

– దేవళ్ల వీరాస్వామి, తంగెడ

ఎమ్మెల్యే మాట నిలబెట్టుకున్నారు



ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. సబ్‌స్టేషన్ మంజూరు చేయించి నిర్మిస్తున్నారు. తంగెడ ప్రజల కరెంట్ కష్టాలు తీరుస్తున్నారు. మా ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. సంతోషంగా ఉంది.

– గొగిరెడ్డి వెంకటరెడ్డి, తంగెడ

ఎమ్మెల్యే చొరవతో గ్రామాభివృద్ధి




తంగెడలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయంటే ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వల్లే. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మించాం. మనబడి నాడు–నేడు ద్వారా గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశాం. విద్యుత్ సబ్‌స్టేషన్‌తో కరెంట్ కష్టాలు తీరిపోతాయి. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కాసు సహకారం, చొరవ మరువలేనిది.

– కొత్తపల్లి కాశయ్య, సర్పంచ్ తంగెడ

సైబర్ తెగింపు

- మన వేలితోనే ఖాతా లూటీ
- పల్నాడులో పేట్రేగిన నేరాలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక





గురజాల : పల్నాడు ప్రాంతంలో ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. నేరస్తులు సరికొత్త పంథాల్లో ప్రజల ఖాతాలను కొల్లగొడుతున్నారు. ఇటీవల గురజాల, మాచర్ల, కారంపూడి, దాచేపల్లి, పిడుగురాళ్ల ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఖాతాదారులకు తెలియకుండా వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు మాయమవుతోంది. ఫలితంగా బాధితులు లబోదిబోమంటూ బ్యాంక్‌లు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు.

ఇవిగో నిదర్శనాలు

- ఇటీవల గురజాలకు చెందిన అమ్మిరెడ్డి రామిరెడ్డి ఖాతాలో నుంచి అతని ప్రమేయం లేకుండా రూ.పది వేలు డ్రా అయినట్టు మేసేజ్ వచ్చింది. బ్యాంక్ అధికారుల దృష్టికి తీసుకువెళ్తే ఫిర్యాదు రాసి ఇవ్వండి.. చూస్తామని బదులిచ్చారు.
- దైద గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఖాతా నుంచి ఏప్రిల్ 10న రూ.పదివేలు, 13న రూ.పదివేలు, 14న రూ.పదివేలు, 15న రూ.పదివేలు చొప్పున మొత్తం రూ.40 వేలు విత్‌డ్రా అయినట్టు స్టేట్‌మెంట్ వచ్చింది. బ్యాంక్ అధికారుల వద్దకు వెళ్లి అడగ్గా ఆరు నెలల్లో మీ ఖాతాకు జమవుతాయని బదులిచ్చారు. ఎందుకు విత్‌డ్రా అయ్యాయని అడిగితే మాత్రం సమాధానం లేదు.
- కారంపూడికి చెందిన విద్యుత్ శాఖ ఉద్యోగి ఖాతా నుంచి గత కొద్ది రోజుల క్రితం రూ.45,693 నగదు డ్రా చేసినట్లు సమాచారం వచ్చింది. వెంటనే బ్యాంక్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఇలా వందల మంది ఖాతాల నుంచి డబ్బులు డ్రా అయినట్లు సమాచారం .

మన వేలిముద్రతోనే ఖాతాల చోరీ

ఖాతాదారుల వేలిముద్రలతోనే సైబర్ నేరస్తులు ఖాతాలను లూటీ చేస్తున్నారని బ్యాంకర్లు, అధికారులు చెబుతున్నారు. ప్రైవేటు సంస్థలు, బ్యాంక్ సేవా కేంద్రాల్లో ఖాతాదారుల వేలిముద్రలను సేకరిస్తున్న సైబర్ నేరస్తులు వాటి ఆధారంగానే ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేస్తున్నట్టు వివరిస్తున్నారు. ఆధార్‌కార్డులో వేలిముద్ర ఆప్షన్‌ను లాక్ చేసుకుంటే సైబర్ నేరాలకు తావు ఉండదని చెబుతున్నారు.

అప్రమత్తత అవసరం



బ్యాంక్ ఖాతాదారులు జాగ్రత్తగా వ్యవహరించాలి. కొత్త పద్ధతిలో ఖాతా నుంచి డబ్బులు డ్రా అవుతున్నట్లు మాకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఆధార్ కార్డు లాక్, ఖాతాకు లాక్ వంటివి ఏర్పాటుచేసుకుంటే మంచిది. కొత్త వారికి బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు చెప్పరాదు. బ్యాంక్ లావాదేవీలు తెలియకపోతే తెలిసిన వారిని వెంటబెట్టుకుని వెళ్లి బ్యాంక్ పనులు చేసుకోవాలి. ఎవరైనా ఓటీపీ చెప్పండి అని అడిగితే చెప్పవద్దు.

– కె.ప్రభాకర్, సీఐ, గురజాల

లారీ సప్లయర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులుగా జక్కుల



జక్కుల అప్పారావును అభినందిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: లారీ సప్లయర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులుగా జక్కుల అప్పారావు యాదవ్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎమ్మెల్యే అప్పారావు యాదవ్‌ను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, గొట్టిముక్కల పవన్‌రెడ్డి, మాచవరం ఎంపీపీ దారం లక్ష్మీరెడ్డితోపాటు వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా కల్పించడమే వైఎస్సార్ సీపీ లక్ష్యం

లెనిన్ నగర్‌లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాసు



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: పేదల జీవితాలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ పని చేస్తోందని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని లెనిన్ నగర్‌లో పేదలకు మంజూరైన ఇళ్ల పట్టాలను గురువారం ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు అదేబాట కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కరికి ఇళ్లస్థల పట్టాలను అందజేస్తున్నట్టు వివరించారు. స్థలాలు ఉన్నా.. హక్కుపత్రాలు లేనివారికీ న్యాయం చేసినట్టు వెల్లడించారు. పట్టాలతో భవిష్యత్తు తరాలకు భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశామని, పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని వివరించారు. త్వరలోనే పిడుగురాళ్ల పట్టణంలోని ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీటిని సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. గురువారం 320 మందికి ఇళ్ల పట్టాలను అందజేశామని, గతంలో 550 మందికి పట్టాలను ఇచ్చామని పేర్కొన్నారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే వారికి కూడా సర్వే నిర్వహించి పట్టాలు అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎండీ గఫార్, మైనార్టీ నేత బచ్చేమేస్త్రీ, కౌన్సిలర్లు షేక్ సైదాబి, జాని, ఉప్పు దేవి వెంకటేశ్వర్లు, గొట్టిముక్కల పవన్‌రెడ్డి, ఇర్లా గురుస్వామి, నంద్యాల ఆంజనేయులు, నాగరాజు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గోలిలో రూ.2.20 కోట్లతో పీహెచ్‌సీ నిర్మాణం



గోలిలో పీహెచ్‌సీ నిర్మాణానికి భూమిని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

గోలి(రెంటచింతల):మారుమూల గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మండలంలోని గోలి గ్రామంలో రూ.2.20 కోట్లతో పీహెచ్‌సీ నిర్మాణం చేపడుతున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. ఇప్పటికే గ్రామ సచివాలయం సమీపంలోని సర్వే నంబర్ 261–8–1సి2లో 1.50 ఎకరాల భూమిని పీహెచ్‌సీ నిర్మాణానికి పరిశీలించారు. ఈ పీహెచ్‌సీ నిర్మాణం వలన జెట్టిపాలెం, పశర్లపాడు, మల్లవరం, సత్రశాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

యువకుడు మృతి



మాచవరం: అతిగా మద్యం సేవించి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పిల్లుట్ల గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అచ్చంపేట మండలం కోనూరుకు చెందిన కారుమంచి జోజిబాబు (35) కొన్నేళ్లుగా మల్లవోలులో నివాసం ఉంటున్నాడు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం అతిగా మద్యం సేవించాడు. పిల్లుట్ల వాటర్ ట్యాంక్ సమీపంలోని చెట్ల పొదల్లో పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో నాలుగు రోజుల క్రితమే గొంతు ఎండిపోయి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం వాసన రావడంతో గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్.కోటయ్య తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలి

వినుకొండ(నూజెండ్ల) : పండ్ల తోటల పెంపకం కోసం రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో జిలానీ బాషా తెలిపారు. నూజెండ్ల మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పండ్ల తోటలు వేసుకునేందుకు 70 ఎకరాలు టార్గెట్ ఇచ్చారన్నారు. నిమ్మ, బత్తాయి, దానిమ్మ, మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, గులాబీ తోటలు వేసుకునేందుకు రైతులు శనివారం లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఎంపీడీవో, ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఏపీవో కట్టా నాగేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు పక్కన 2500, సచివాలయాల వద్ద 50 మొక్కలు నాటాలని చెప్పారు. మునగ మొక్కలు, బ్లాక్ ప్లాంటేషన్ తదితర అంశాల గురించి వివరించారు.

సత్యసాయి ఎడ్యుకేషన్ సేవలు ప్రశంసనీయం



పట్టణంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, కిట్లు అందజేస్తున్న సత్యసాయి నిర్వాహకులు

మాచర్ల: సత్యసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణనిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షులు అక్కినేని అనిల్ కుమార్ చెప్పారు. పట్టణంలోని సత్యసాయి బాబా విద్యా మందిరంలో 45 రోజులుగా 20 మంది మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణనిచ్చారు. గురువారం వారికి సర్టిఫికెట్లు, కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అతిథులుగా వైద్యులు లక్ష్మీ ప్రసన్న, అనురాధ పాల్గొని మహిళలనుద్దేశించి మాట్లాడారు. మాచర్ల పట్టణంలో 45 రోజులు ప్రత్యేక శిక్షణనివ్వడం గొప్ప విషయమన్నారు. పాఠశాల నిర్వాహకులు జక్కా శ్రీనివాసరావు, అక్కినేని అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సత్యసాయి విద్యా మందిరానికి చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

- భర్త, కూతురికి స్వల్పగాయాలు
- ముగ్గురూ కలిసి స్కూటీపై వెళ్తుండగా దుర్ఘటన



ప్రమాదస్థలంలో తీవ్ర గాయాలతో మహిళ

పిడుగురాళ్ల: స్కూటీని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో మహిళ మృతి చెందిన ఘటన పట్టణంలోని కొండమోడు రోడ్డులోని బాలాజీ వేబ్రిడ్జి వద్ద గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన ఎం.లక్ష్మి(40), ఆమె భర్త శ్రీనివాసరావు, కూతురు స్కూటీపై నర్సరావుపేట వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే వెనుక నుంచి వస్తున్న లారీ స్కూటీని ఢీకొనటంతో లక్ష్మి తీవ్రంగా గాయపడింది. భర్త శ్రీనివాసరావుకు, కూతురుకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన లక్ష్మిని తొలుత నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషయమించటంతో మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆమె మృతి చెందారు. పట్టణ ఎస్‌ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపారు.

మహాయజ్ఞం పోస్టర్లు ఆవిష్కరణ



మహాయజ్ఞం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రభుత్వవిప్ పీఆర్కే, ఆర్యవైశ్య నాయకులు

మాచర్ల: రాష్ట్ర ప్రజల క్షేమం కోసం శుక్రవారం నుంచి 17వ తేదీ వరకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న 108 కుడాత్మక చండీ రుద్ర, రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం పోస్టర్లను గురువారం ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) తన కార్యాలయంలో ఆర్యవైశ్య సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం యజ్ఞం నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో అడిగొప్పల నిదానంపాటి అమ్మవారి ఆలయం, మాచర్ల ఈఓలు నరసింహబాబు, సాంబయ్య, ఆర్యవైశ్య సంఘ నేతలు కొత్తమాసు బ్రహ్మరావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కె.కోటయ్య, కౌన్సిలర్లు మురళి, మదార్‌సాహెబ్ పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- 17వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. స్థానిక 17వ వార్డు పెద్ద మసీదు ఎదురు ఎస్సీ కాలనీలో గురువారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రతిగడపా పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తొలుత 17వ వార్డు కౌన్సిలర్ పసుపులేటి ఆనంద్, 18వ వార్డు కౌన్సిలర్ జోగిపర్తి సుజాత ముక్కంటితోపాటు పలువురు మహిళలు హారతులతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు అందిస్తామని చెప్పారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను ఇప్పటికే పరిష్కరించామని, త్వరలోనే మరిన్ని వసతులు కల్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్, మున్సిపల్ కౌన్సిలర్లు పసుపులేటి ఆనంద్‌బాబు, జోగుపర్తి సుజాత, ముక్కంటి, నేలటూరి బాలస్వామి, అజ్మీర శారద, కొక్కెర శ్రీనివాసరావు, నంద్యాల ఆంజనేయులు, మాదాల కిరణ్‌కుమార్, పులి వెంకట బాలకాశీరావు, షేక్ సైదావలి, ఉన్నం ఆంజనేయులు, పట్టణ యూత్ కన్వీనర్ మందా సుధీర్, మార్కెట్ యార్డు డైరెక్టర్ జాషువా, నాయకులు బంకా అనిల్, మందా ప్రేమ్‌రాజ్, ఇల్లూరి వెంకయ్య, డేగల యోహాన్, పసుపులేటి అనిల్, వర్లా రత్నం పలువురు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌రాజు తదితరులు

వినుకొండ(నూజెండ్ల) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికలాంగుల చట్టాన్ని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు కిరణ్‌రాజు పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016 ఏప్రిల్ 19న కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విభిన్న ప్రతిభావంతుల చట్టాన్ని పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. ఈ చట్టంలోని 51 నిబంధనల్ని అమలు చేస్తూ వికలాంగుల హక్కుల్ని కూడా కాపాడుతున్నట్లు చెప్పారు. దీనికి కృతజ్ఞతగా రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మీయ అభినందన సభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వికలాంగుల కో–ఆర్డినేటర్ కొమ్మిరెడ్డి శివారెడ్డి మాట్లాడుతూ వికలాంగులకు రక్షణ కల్పించేందుకు హక్కుల చట్టాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయడాన్ని అభినందించారు. అనంతరం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేశారు.

అద్దె భవనము కావలెను

[illegible]

మాచర్లలో భారీ వర్షం

మాచర్ల: పట్టణంలో గురువారం సాయంత్రం నుంచి ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. వాన రాత్రి వరకు కురుస్తూనే ఉంది. ఈదురు గాలలతో ప్రజలు భీతిల్లారు. గాలులకు ఫ్లెక్సీలు, చెట్లు నేలవాలాయి. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

